సాక్షి
అనంతపురం
మంగళవారం । 20 । మే । 2025



కారుణ్యం లేదు....
కారుణ్య నియామకాలు పెండింగ్‌లో పడిపోయాయి. బాధిత కుటుంబీకులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నా ఫలితం కానరావడం లేదు. 8లో



చీనీ టన్ను రూ.43 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.43 వేలు పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.8°/23.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పకడ్బందీగా బదిలీల ప్రక్రియ

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల ప్రక్రియలో నిబంధనలను అతిక్రమించరాదన్నారు. ఏ దశలోనూ విమర్శలు, ఆరోపణలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న వాహనాల వేలం ప్రక్రియను జూన్ 20లోపు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌టీఏ అధికారులకు లేఖ రాస్తే వారు వచ్చి పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. కార్యాలయాల్లో వృథా సామగ్రిని కూడా వేలం వేయించి సంబంధిత రికార్డుల్లో వివరాలను పొందుపర్చాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు జిల్లాలో 975 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 3,043 మంది విద్యార్థులకు గాను 2,068 మంది హాజరయ్యారు. 42 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 21 కేంద్రాలను తనిఖీలు చేశాయి.

రేపు డీఈఓ కార్యాలయ ముట్టడి

- టీచర్లు తరలిరావాలని

ఉపాధ్యాయ సంఘాల వేదిక పిలుపు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ రంగ సమస్యలపై సోమవారం ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోరుబాటకు సిద్ధమయ్యారు. ఈనెల 21న జిల్లాలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు వైఎస్సార్‌టీఏ ఎస్.నాగిరెడ్డి, ఆప్టా కె.వెకంటరత్నం పిలుపునిచ్చారు. విజయవాడలోని విద్యాభవన్‌లో దాదాపు 8 గంటలకు పైగా పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, సంచాలకులు విజయరామరాజుతో ఉపాధ్యాయ సంఘాలు జరిపిన చర్చలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. 16 ప్రధాన డిమాండ్లపై ఉన్నతాధికారులు–ఉపాధ్యాయ సంఘాల నేతలు జరిపిన చర్చలు కొలిక్కి రాలేదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చలు జరపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరినా అధికారులు అంగీకరించలేదన్నారు. ఈ క్రమంలో 21న డీఈఓ కార్యాలయాల ముట్టడి, 23న కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బ్యాంక్‌కు తాళం వేసిన రైతులు



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

శెట్టూరు: పంట రుణాలు రెన్యూవల్ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్యాంక్‌కు తాళం వేసి ధర్నా చేపట్టారు. శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. సోమవారం ఉదయం పంట రుణాల రెన్యూవల్ చేయాలంటూ లక్ష్మంపల్లిలోని కెనరా బ్యాంక్ శాఖకు 40 మంది రైతులు వెళ్లారు. అయితే బ్యాంక్‌లో రైతులకు సంబంధించి వన్ బీలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో పంట రుణాలను రెన్యూవల్ చేయడం సాధ్యం కాదంటూ బ్యాంక్ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో కొందరు రైతులు మీ సేవ నుంచి, మరికొందరు తహసీల్దార్ సంతకంతో కూడిన 1 బీలను తీసుకెళ్లి బ్యాంక్ అధికారులకు అందజేశారు. వీటిని తాము పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేయడంతో రైతుల్లో అసహనం పెల్లుబుకింది. వెంటనే బ్యాంక్‌కు తాళం వేసి గేట్ ఎదుట బైఠాయించారు. సకాలంలో పంట రుణాలు రెన్యూవల్ చేయకపోతే తీవ్రంగా నష్టపోయేది రైతులేనన్న విషయాన్ని బ్యాంక్ అధికారులు విస్మరించారంటూ ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన బ్యాంకుల్లో రైతుల సమస్యలు, కష్టాలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే పంట రుణాలు రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు వైస్ ఎంపీపీ ముత్యాలు,వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకుడు ఇమామ్ వలీ, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు.

అరాచక రాజు



- టీడీపీ కార్యకర్త కంటే దిగజారి ప్రవర్తిస్తున్న కూడేరు సీఐ
- సర్కిల్ పరిధిలో మితిమీరిన దౌర్జన్యాలు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తల్ని టార్గెట్ చేసి మరీ వేధింపులు
- ‘పచ్చ’ కండువా వేసుకుంటే అంతా ఓకే అంటున్న వైనం
- ‘అయ్య’ ఆదేశానుసారం ఇష్టారాజ్యంగా విధులు

ప్రభుత్వ అధికారినన్న విషయాన్ని ఆయన మరచిపోయారు. ప్రజలకు రక్షణ కల్పించే బాధ్యతలను విస్మరించారు. ‘పచ్చ’ కండువా వేసుకున్న వ్యక్తి కంటే హీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారు. ‘అయ్య’ ఆదేశానుసారం ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ‘ఏరా నా లిమిట్స్‌లో బోర్ వేస్తావా? నీకెంత ధైర్యం. మర్యాదగా బండి స్టేషన్‌లో పెట్టు. అయ్య చెబితే బండి వదుల్తా. మర్యాదగా ‘పచ్చ’ కండువా వేసుకో.. లేదంటే అంతు చూస్తా...’ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు సర్కిల్ పోలీసుస్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న రాజు అన్న మాటలివి. టీడీపీ కార్యకర్త కంటే అధ్వానంగా ప్రవర్తిస్తున్న ఈయన అరాచకాలు పెచ్చుమీరిపోయినట్లు విమర్శలొస్తున్నాయి. ఫలానా వ్యక్తి టీడీపీకి వ్యతిరేకంగా ఉన్నాడు అంటే చాలు టార్గెట్ చేసి మరీ టార్చర్ పెట్టడం సీఐకి అలవాటుగా మారిపోయింది.

బోర్‌వెల్ వేయడానికి నీకెంత ధైర్యం..

కూడేరు మండలం మరుట్ల–1 కాలనీకి చెందిన శ్రీనివాసులు అద్దెకు బోర్‌వెల్ బండి తెచ్చుకున్నాడు. ఇతను వైఎస్సార్ సీపీ అభిమాని. ఇటీవల ఉదిరిపికొండ గ్రామ సమీపంలోని ఓ పొలంలో బోర్ వేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ రాజు.. అక్కడికి కానిస్టేబుళ్లను పంపించి లారీని స్టేషన్‌కు రప్పించారు. ఈ క్రమంలో శ్రీనివాసులపై రెచ్చిపోయారు. ‘మర్యాదగా పయ్యావుల శీనప్ప దగ్గరికి వెళ్లు.. అక్కడి నుంచి ఫోన్ చేయిస్తే నీ బండి వదులుతా. అక్కడే పచ్చ కండువా వేసుకుని రా.. లేదంటే నీ అంతు చూస్తా’ అంటూ అతన్ని బెదిరించారు. అంతటితో ఆగక ఆర్టీఓను పిలిపించి రూ.60 వేల ఫైన్ వేయించారు. మరో రూ.50 వేల లంచమూ తిన్నారు! చివరకు ఆ బోర్‌వెల్ బండిని టీడీపీ కార్యకర్తకు అద్దెకు ఇప్పించడం గమనార్హం.

నా అనుమతి లేకుండా పాలు సేకరిస్తావా..?

మరుట్ల–3 కాలనీకి చెందిన రామాంజనేయులు ‘దొడ్ల’ డెయిరీ కంపెనీకి గ్రామంలో పాల సేకరణ చేసేవాడు. సీఐ దాన్ని పీకేయించి పాలసేకరణకు ఆటోలు రాకుండా ఆపించారు. సేకరణ బాధ్యతలు టీడీపీ కార్యకర్తకు ఇప్పించారు. ఈ క్రమంలోనే రామాంజనేయులు ‘గాయత్రి’ డెయిరీ పాల సేకరణకు వెళ్లగా.. ‘ఏరా ఒకసారి ఆపితే వేరే కంపెనీకి పాలు సేకరిస్తావా’ అంటూ బెదిరించి బలవంతంగా దాన్ని కూడా ఆపేయించారు. సదరు డెయిరీకి సంబంధించిన ఆటో డ్రైవర్‌ను కూడా బెదిరించి ఊర్లోకి రాకుండా చేశారు. దీంతో రామాంజనేయులు ఉపాధి కోల్పోయాడు. అంతేకాదు సీఐ ఎప్పుడేం చేస్తారో అని ఇప్పటికీ అతను భయపడుతున్నాడు.



దళిత రైతుకు చుక్కలు..

కూడేరు మండలంలో ధనుంజయ అనే రైతు తన పొలానికి ట్రాన్స్‌ఫార్మర్ బిగించుకున్నాడు. అదే సర్వీసు కింద మరో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ధనుంజయ వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కావడంతో విద్యుత్ శాఖ ఏఈతో ఓ తప్పుడు ఫిర్యాదు ఇప్పించిన సీఐ.. కానిస్టేబుళ్లను పంపించి డీపీని పీకేయించారు. జీపులో పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసుల జీపునకు ధనుంజయ భార్య అడ్డుపడినా ఆమెను పక్కకు లాగేసి మరీ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకొచ్చారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు సీఐ రాజు అరాచకాలు రోజు రోజుకూ పెచ్చు మీరుతున్నాయి. కొన్ని రోజుల క్రితం చోళసముద్రం గ్రామంలో టీడీపీ కార్యకర్త నిర్వాకంతో కరెంటు పనిచేస్తున్న ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై బాధితులు ఫిర్యాదు ఇచ్చినా ‘తెలుగు తమ్ముడి’పై కేసు నమోదు చేయలేదంటే అధికార పార్టీకి సీఐ ఎంతలా కొమ్ము కాస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

కంబదూరు వైస్ ఎంపీపీగా సోమశేఖర్



ఎనుముల సోమశేఖర్ (కూర్చున్న వ్యక్తి), ఎంపీటీసీలతో తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు వైస్ ఎంపీపీగా ఎనుముల సోమశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా డీఎల్‌డీఓ నాగేశ్వర రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎంపీటీసీ సోమశేఖర్‌ను ఎంపీటీసీలు చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారులు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించి వైస్ ఎంపీపీగా ధ్రువీకరణ పత్రం అందజేశారు. సోమశేఖర్‌కు వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎంపీటీసీలకు సోమశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, సమన్వయకర్త తలారి రంగయ్య, నాయకులు ఉమామహేశ్వర నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ తిమ్మారెడ్డి, ఎంపీటీసీలు ఈరన్న, నాగలక్ష్మి, మాధవి, సరస్వతి, నాగరత్నమ్మ, విద్యావతి, శ్రీదేవి, లక్ష్మి, నరసక్క, శివమ్మ, పలు మండలాల పార్టీ కన్వీనర్లు హనుమంతరాయుడు, వెంకటప్ప, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, గోళ్ల సూరి తదితరులు పాల్గొన్నారు.

మురిపించాయి.. ముంచేస్తాయా?

- ముందస్తు వర్షాలతో రైతుల్లో ఆందోళన
- ఖరీఫ్ కీలక దశలో ముఖం చాటేస్తాయేమోనని అనుమానం

అనంతపురం అగ్రికల్చర్: అవసరం లేని సమయంలో అధిక వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌లో పంటలు విత్తుకునే సమయంలోనూ, లేదంటే పంటలు కీలక దశకు చేరుకున్న సమయంలో వెనుకటి వర్షాలు చేయిస్తాయేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి అనుభవాలను చవిచూశామని గుర్తు చేసుకుంటున్నారు. ముందస్తు వర్షాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. మే సాధారణ వర్షపాతం 36.7 మి.మీ కాగా... అందులో మే 19 నాటికి 16.8 మి.మీ పడాల్సి ఉంటుంది. కానీ ఇప్పటికే ఏకంగా 79.6 మి.మీ వర్షం కురిసింది. 31 మండలాల్లోనూ సాధారణం కన్నా ఐదు నుంచి పదింతల రెట్టింపు వర్షపాతం నమోదైంది. ఇంత వరకూ బాగానే ఉన్నా రాబోయే రోజుల్లో వర్షాలు ముఖం చాటేస్తాయేమోననే ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. విత్తుకు ఇంకా 10 రోజులు మిగిలిఉండటం, వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో... ఇప్పుడు కురిసే వర్షాలు ముంగారుకు ఏ విధంగానూ ఉపయోగపడవని చెబుతున్నారు.

బెళుగుప్ప మండలం నాగులచెరువులో నీరు



జూన్ 15 తర్వాత సాగుకు అదను..

ఖరీఫ్‌లో పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు మంచి అదనుగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ఈ సారి ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇంకా వర్షసూచన ఉందని చెబుతున్నారు. అలాగే కీలకమైన నైరుతీ రుతుపవనాలు ఈ సారి ముందస్తుగానే అంటే ఈనెల 27న కేరళను తాకుతాయని వారం క్రితమే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారికంగా ప్రకటించింది. రుతుపవనాలకు అనుకూల వాతావరణం ఉన్నందున ఇంకా ముందుగానే అంటే 24న కేరళను తాకవచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఈ నెలాఖరుకు ‘అనంత’లోకి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఖరీఫ్ సాగుపై రైతుల్లో అయోమయం నెలకొంది. మరోపక్క కూటమి సర్కారు, వ్యవసాయశాఖ ఇప్పటికీ విత్తన పంపిణీ ప్రక్రియ మొదలు పెట్టకపోవడం అన్నదాతలకు శాపంగా మారింది.

23 మండలాల్లో వర్షం

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 23 మండలాల పరిధిలో 6.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కంబదూరు 28.8 మి.మీ, శింగనమల 22.2, నార్పల 18.6, కుందుర్పి 17.8, గార్లదిన్నె 13.6, డీ.హీరేహాళ్ 11, ఆత్మకూరు 10 మి.మీ వర్షపాతం నమోదైంది. గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, పామిడి, రాప్తాడు, బుక్కరాయసముద్రం, అనంతపురం, బెళుగుప్ప, శెట్టూరు, బ్రహ్మసముద్రం, గుంతకల్లు, పుట్లూరు, యాడికి, వజ్రకరూరు, కళ్యాణదుర్గం, యల్లనూరు తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

చెరువుల్లోకి నీళ్లు..

వర్షాలకు 20 చెరువులు పూర్తిగా నిండిపోగా మరో 20 చెరువుల్లోకి 75 శాతం నీళ్లు చేరినట్లు తెలిసింది. బెళుగుప్ప, గార్లదిన్నె, గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు, రాప్తాడు, వజ్రకరూరు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో చెరువులు జలకళ సంతరించుకున్నాయి.

సారూ.. సమస్యలు పరిష్కరించండి

- ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో అర్జీదారుల వేడుకోలు
- వివిధ సమస్యలపై 460 వినతులు

అనంతపురం అర్బన్: ‘సమస్యలు పరిష్కరించండి సారూ’ అంటూ అధికారులను పలువురు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో ప్రజల నుంచి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల,డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్,రామకృష్ణారెడ్డి, ఆనంద్, తిప్పేనాయక్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 460 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- చలానా కట్టినా భూమిని సర్వే చేసేందుకు రావడం లేదని అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డికి చెందిన రాము ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 44–3లో 1.69 ఎకరాలు, 43–4లో 90 సెంట్ల సర్వే కోసం చలానా కట్టామని, సర్వేయర్ అందుబాటులో ఉండడం లేదని చెప్పాడు. తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- ప్రభుత్వం మంజూరు చేసిన ప్లాట్‌కు హద్దులు చూపించడం లేదని అనురాధ ఫిర్యాదు చేసింది. రాప్తాడు మండలం పండమేరు గ్రామ సర్వే నంబర్ 134, 135లో వేసిన లే–అవుట్‌లో తమకు 362వ ప్లాట్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే ఈ ప్లాట్‌కు హద్దులు చూపించాలని తహసీల్దారు కార్యాలయంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపింది. సర్వే చేయించి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరింది.
- శింగనమల మండలం చక్రాయపేట గ్రామ సర్వే నంబర్ 539–2,4,5, 538లో కొందరికి ప్రభుత్వం డీ పట్టా ఇచ్చిందని, అయితే ఒక వ్యక్తి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ గుట్టతో పాటు భూముల్లో యంత్రాల సహాయంతో మట్టిని తోడేసి అక్రమంగా తరలిస్తున్నాడని వెంకటస్వామి ఫిర్యాదు చేశాడు.

డ్రైఫ్రూట్స్ అలంకరణలో నెట్టికంటుడు

గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని రెండో రోజు డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. సోమవారం వేకువజామునే ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవ మూర్తిని ఆలయ ముఖ మంటపంలో కొలువుదీర్చి తమలపాకులతో లక్షార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



రూ. లక్షలు.. ‘చెత్త’లో పోసిన పన్నీరు!

రూ. లక్షలు పెట్టి ఈ వాహనాలు కొనుగోలు చేశారు. వాటితో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాల్సి ఉంది. ఎందుకో తెలియదు కానీ.. పంపిణీ మాత్రం చేయలేదు. దీంతో ఇదిగో ఇలా అనంతపురం హౌసింగ్ బోర్డులోని పార్కులో వృథాగా పడి ఉన్నాయి. ఈ క్రమంలో పిల్లలు వాటిపైకి చేరి ఆడుకుంటుండడంతో దెబ్బతింటున్నాయి. కొన్ని వాహనాల చక్రాలు అప్పుడే ఊడిపోయాయి. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు వాహనాలను వినియోగంలోకి తెస్తే నగరంలో పరిశుభ్రత మెరుగుపడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. లేకుంటే రూ. లక్షలు... ‘చెత్త’లో పోసిన పన్నీరు చందంగా మారే పరిస్థితులు లేకపోలేదు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



జంట హత్యల కేసులో ఆరుగురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

రాప్తాడు: రైతు దంపతుల హత్య కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాప్తాడు పీఎస్‌లో సోమవా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. ఈ నెల 17న రాప్తాడు మండలం గొల్లపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులపై టీడీపీ కార్యకర్తలు వేట కొడవళ్లు, కట్టెలతో దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే.

భూ వివాదమే కారణం..

గంగలకుంట రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 78–3లో 6.20 ఎకరాల భూమిని ఎకరాకు రూ.56.50 లక్షల చొప్పున కొనుగోలు చేసేలా రాప్తాడుకు చెందిన నీరుగంటి పుల్లమ్మ, అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరుకు చెందిన నాగలక్ష్మమ్మ, బత్తలపల్లి మండలం పోట్లమర్రికి చెందిన వెంకటలక్ష్మికి రూ.79 లక్షలు చెల్లించి రాప్తాడుకు చెందిన పామల్ల ధనుంజయ, పామల్ల కొండప్ప, పామల్ల ఇంద్రశేఖర్, గోనిపట్ల శీన, పామల్ల పండయ్య, గొల్లపల్లి జగదీష్, లక్ష్మీనారాయణ, నంద కుమార్, బుల్లే నగేష్ 2024 సెప్టెంబర్‌లో అగ్రిమెంట్ చేసుకున్నారు. హతుడు చిగిచెర్ల నారాయణ రెడ్డి తండ్రి చిగిచెర్ల నారాయణరెడ్డి నుంచి 1997లో ఎకరా రూ.15 వేల చొప్పున మొత్తం రూ.93 వేలతో కొనుగోలు అగ్రిమెంట్‌ను పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మమ్మ రాయించుకున్నారు. అయితే చిగిచెర్ల నారాయణరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించకుండా ఉండడంతో ముగ్గురు మహిళలు కోర్టులో దావా వేశారు. 2012లో కోర్టులో ముగ్గురు మహిళల పక్షాన డిక్రీ చేస్తూ వాళ్ల పేరుపై కోర్టు రిజిస్ట్రేషన్ చేయించింది. అనంతరం ఇదే భూమిని చిగిచెర్ల నారాయణ రెడ్డి తన బావ ఓబిరెడ్డి ద్వారా అతని భార్య నారాయణమ్మకు చెందుతుందని కోర్టులో దావా వేయించాడు.





నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు, (ఇన్‌సెట్) హత్యకు ఉపయోగించిన వేటకొడవళ్లు, కట్టెలు

ఈ వివాదంపై 2022లో ముగ్గురు మహిళలకు భూమి చెందుతుందని కోర్టు తీర్పు వెలువరించగా.. దీన్ని సవాల్ చేస్తూ నారాయణ రెడ్డి అదే ఏడాది ఫ్యామిలీ కోర్టులో అప్పీలు దాఖలు చేశాడు. ప్రస్తుతం ఆ భూమిలో నారాయణరెడ్డి దానిమ్మ చెట్లు సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో భూమిని తమ పేరుపై మ్యుటేషన్ చేయాలని ముగ్గురు మహిళలు ఈ ఏడాది హైకోర్టులో పిల్ వేయగా.. సరైన నిర్ణయం తీసుకోవాలంటూ ఆర్డీఓకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

వివాదం కొలిక్కి రాకనే....

వివాదం కొలిక్కి రాకనే ముగ్గురు మహిళల నుంచి భూమిని కొనుగోలు చేసిన వారు నెల రోజుల క్రితం మళ్లీ సదరు మహిళలకు రూ.1.01 కోట్లు చెల్లించారు. ఈ నేపథ్యంలోనే ఆర్డీఓ సిఫారసుల మేరకు సదరు భూమిని ఆన్‌లైన్‌లో నారాయణరెడ్డి పేరు తొలగించి ముగ్గురు మహిళల పేరు ఎక్కించాలని గత నెల 29న డీఆర్‌ఓ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ నారాయణరెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. అయితే డీఆర్‌ఓ ఆదేశాల మేరకు గత నెల 14న నీరుగంటి పుల్లమ్మ పేరును రాప్తాడు తహసీల్దార్ ఆన్‌లైన్‌లో ఎక్కించారు. 16న పామల్ల ధనుంజయ, పామల్ల కొండప్ప, గోనిపట్ల శీన, పామల్ల పండయ్య, హనుమంతరెడ్డి, బాల నరసింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి, పుల్లమ్మ, నాగలక్ష్మమ్మ, దండు నరేంద్ర, గొల్లపల్లి జగదీష్, గంగలకుంట లక్ష్మీనారాయణ, బుల్లె నగేష్ సదరు పొలం దగ్గరికి వెళ్లి నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మను భూమిలోకి కాలు పెడితే చంపేస్తామంటూ బెదిరించారు. ఈ నెల 17న ఉదయం 9.30 గంటలకు జేసీబీతో పొలంలో దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా నారాయణరెడ్డి, ముత్యాలమ్మ, వారి కుమారుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి, బావమరిది ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి తదితరులు అక్కడకెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న వేటకొడవళ్లు, కట్టెలతో ముత్యాలమ్మ, నారాయణరెడ్డిపై విచక్షణారహితంగా దాడికి తెగబడడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రతాప్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం గంగలకుంట క్రాస్ వద్ద పామల్ల ధనుంజయ, ఇంద్రశేఖర్, నిరంజన్‌రెడ్డి, దండు నరేంద్ర, బుడగ లక్ష్మీనారాయణ, కందుకూరుకు చెందిన దయ్యం హనుమంతరెడ్డిని అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

'రెడ్‌బుక్ కుట్రలో భాగమే అక్రమ అరెస్టులు'



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వ

ఉరవకొండ: తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాల ఆధారంగా విశ్రాంత అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, ఇది రెడ్‌బుక్ కుట్రలో భాగమేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం అక్రమ కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్ ముమ్మాటికీ అక్రమమని అన్నారు. అధికారులన్న కనీస గౌరవం లేకుండా అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్షపార్టీపై ప్రతీకారం తీర్చుకోవడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చే ధైర్యం లేక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలతో పాటు అధికారులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బసవరాజు పాల్గొన్నారు.

కారుణ్యం లేదు.. కాఠిన్యం తప్ప

- పెండింగ్‌లో కారుణ్య నియామకాలు
- ఎదురు చూస్తున్న బాధిత కుటుంబాలు
- పదోన్నతుల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం
- ఏడాదిగా ఎదురుచూపులకే పరిమితమైన రెవెన్యూ ఉద్యోగులు



అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగంలో రెవెన్యూ శాఖ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అన్ని శాఖలకు మార్గదర్శకంగా ఉండాల్సిన ఈ శాఖ... ప్రస్తుతం తన శాఖ ఉద్యోగుల నుంచే విమర్శలను ఎదుర్కొంటోంది. ప్రధానంగా కారుణ్య నియామకాల విషయంలో జాప్యంపై.. పదోన్నతుల అంశంలో కనబరుస్తున్న నిర్దయపై రోజురోజుకూ ఉద్యోగులో అసహనం పెరిగిపోతోంది. జాప్యానికి అధికారులు చెబుతున్న... చూపుతున్న కారణాలు సహేతుకమైనవి కాదని అభిప్రాయం ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతోంది.

కారుణ్య నియామకాలకు మోక్షం ఎన్నడో

ఓ ఉద్యోగస్తుడు మరణిస్తే ఆయన కుటుంబం దిక్కులేనిది కాకుండా ఉండేందుకు కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తారు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఉద్యోగం ఇవ్వాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ శాఖలకు సంబంధించి కారుణ్య నియామకాలు కలెక్టర్ కార్యాలయం నుంచి జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ దాదాపు 32 మంది బాధితులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పించాల్సి ఉంది. అయితే గతంలో ఎన్నడూ లేనంతంగా కారుణ్య నియామకాల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ఓ వైపు కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో పోషణ భారమై ఉద్యోగం కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పదోన్నతుల కల్పనలో కాఠిన్యం

ఉద్యోగుల తమ సర్వీసులో కోరుకునే అత్యంత ప్రాధాన్యతా అంశం పదోన్నతి. పదోన్నతల కల్పనలో జాప్యం నెలకొంటే ఆ ప్రభావం ఉద్యోగుల విధి నిర్వహణపై పడుతుంది. వారిలో ఉత్సాహం సన్నగిల్లి... నిరాశ నిస్పృహతో పని చేస్తుంటారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ ఉద్యోగులు ఇలాంటి పరిస్థితిలోనే కొట్టుమిట్టాడుతున్నారు. వివిధ కేడర్లలో ఖాళీగా పోస్టులకు పదోన్నతి అర్హత ఉన్న వారు ఏడాదిగా వేచి ఉన్నారు. అయితే పదోన్నతుల కల్పన నిర్ణయంపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తుండడంతో అంతులేని జాప్యం చోటు చేసుకుంటోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తి కావడం విశేషం.

తప్పని ఎదురుచూపులు

సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందేందుకు ఇప్పటికే సర్వే టెస్ట్, డిపార్ట్‌మెంటల్ టెస్ట్, ఆకౌంట్ టెస్ట్, ఇతర రెవెన్యూ టెస్టులు ఉత్తీర్ణత సాధించిన జూనియర్ అసిస్టెంట్లు (జేఏ) 30 మంది ఉన్నారు. శాఖలో 32 సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసే అవకాశం ఉన్నా... నేటికీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్రస్తుతం డీటీలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన 15 మంది ఎస్‌ఏలు ఉన్నారు. అయితే ఈ ప్రక్రియ నెలలుగా ముందుకు సాగకపోవడంతో వారికీ ఎదురు చూపులు తప్పలేదు.

పదోన్నతుల పెండింగ్ ఇలా...

జూనియర్ అసిస్టెంట్	9
సీనియర్ అసిస్టెంట్	32
డిప్యూటీ తహసీల్దారు	17
సీఎస్ డిప్యూటీ తహసీల్దార్లు	26

ప్రక్రియ చేపడతాం

కారుణ్య నియాకాలు, పదోన్నతుల ప్రక్రియ తక్షణం మొదలు పెడతాం. ఇందుకు సంబంధించి అంశాలను పరిశీలించాను. కారుణ్య నియామకాల ఫైళ్లను తెప్పించుకుని వీలైనంత త్వరగా ఉద్యోగాలు కల్పిస్తాం. ఇక పదోన్నతుల విషయంలో న్యాయపరమైన చిక్కులపై సలహా అడిగాం. త్వరలోనే ఈ ప్రక్రియనూ పూర్తి చేస్తాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

యోగాంధ్రపై చైతన్యం తీసుకువస్తాం

- సీఎస్‌కు తెలిపిన కలెక్టర్ వినోద్‌కుమార్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: యోగాంధ్ర–2025 క్యాంపెయిన్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. యోగాంధ్ర, తదితర అంశాలపై సీఎస్ సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌ఓ ఎ.మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో యోగాంధ్ర–2025 నిర్వహణలో భాగంగా తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర ఆలయం, గుత్తి కోట వంటి చారిత్రాత్మక ప్రదేశాల్లో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ అంశంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ బాలస్వామి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరులోని కోట వీధిలో నివాసముంటున్న రామాంజినమ్మ, మల్లేశప్ప దంపతలకు ఇద్దరు కుమార్తులు, కుమారుడు శ్యామ్ (24) ఉన్నారు. బేల్దారి పనులతో శ్యామ్ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. సోమవారం రోజులాగే కంబదూరులో గృహ నిర్మాణ పనుల్లో పాల్గొన్న శ్యామ్... ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై భవనం పైనుంచి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే కంబదూరులోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కంబదూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాపంపేటలో మహిళ ఆత్మహత్య

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన లక్ష్మీదేవి (45) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త కుళ్లాయప్ప గతంలోనే చనిపోయాడు. కుమారుడు రామాంజనేయులు ఆటోమొబైల్స్‌లో పని చేస్తున్నాడు. కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీదేవి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐగా గురుప్రసాద్



కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా గురుప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ హసీనాభాను అవినీతి ఆరోపణలపై బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో విడపనకల్లు చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న గురుప్రసాద్‌కు ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లుగా తెలిసింది.

నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఎక్సైజ్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో గ్రామాల్లో నాటుసారాను తయారు చేసే పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయంపై నిఘా పెట్టాలని సూచించారు. బెల్టుషాపులు లేకుండా చూడాలన్నారు. లైసెన్స్ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ విక్రయిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఫరూక్ ఆజామ్, ఎస్‌ఐ శివప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ అక్రిడిటేషన్ వ్యవహారంలో వ్యక్తి అరెస్ట్

అనంతపురం: జిల్లా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ అక్రిడిటేషన్‌లు సృష్టించిన వ్యవహారంలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. ప్రజాబలం పేరుతో యూట్యూబ్ చానల్ నడిపే చందులాల్‌నాయక్, మన్నల దేవరాజు ఇద్దరూ కలిసి నకిలీ అక్రిడిటేషన్లు సిద్ధం చేసుకుని వాటిపై జిల్లా కలెక్టర్ డిజిటల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అసలు అక్రిడిటేషన్ కార్డుగా చలామణి చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లి అక్కడ పనిచేసే ఉద్యోగులను బెదిరిస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా తెలుసుకున్న డీఐపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టారు. సోమవారం మన్నల దేవరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న చందులాల్‌నాయక్ కోసం గాలిస్తున్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన మేరకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా మహాసభలను జూలై 25 నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు, ఇతర ప్రజాసమస్యలపై జిల్లా మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎన్నికల హామీ మేరకు పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలనే డిమాండ్‌తో జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, కేశవరెడ్డి, రాజేష్‌గౌడ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

కుక్కలకు కు.ని.!

- జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో 10,315 వీధి కుక్కల గుర్తింపు

జిల్లాలో కుటుంబ నియంత్రణ చేసేందుకు గుర్తించిన కుక్కల సంఖ్య

అనంతపురం నగర కార్పొరేషన్	6,150
గుంతకల్లు	1,362
తాడిపత్రి	564
రాయదుర్గం	817
గుత్తి	714
కళ్యాణదుర్గం	708
మొత్తం	10,315



వ్యాక్సిన్ వేయిస్తున్నాం

కుక్కలకు కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్స, రేబిస్ వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ ప్రక్రియ పూర్తి కాగానే వాటిని సులువుగా గుర్తించేందుకు కుక్క ఎడమ చెవి చివరి బాగం కొంత కత్తిరించాలని ఆదేశాలు చేశాం. మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ మొదలవుతోంది. జిల్లాలో మూడు క్లస్టర్లలో శస్త్రచికిత్సలు జరిపేలా చర్యలు చేపట్టాం.

– పి.విశ్వనాథ్, మున్సిపల్ ఆర్డీ, అనంతపురం

రాయదుర్గం: జిల్లాలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. వాటి చెలగాటం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. అనంతపురం నగర కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం మున్సిపాల్టీల్లో 10,315 వీధి శునకాల్ని ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించారు. సాధారణంగా ఓ కుక్క ఏడాదికి రెండు సార్లు సంతానోత్పత్తి చేస్తోంది. దీంతో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి కుక్కనీ పట్టుకుని రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహించాలి. కానీ, ఏళ్ల తరబడి జిల్లాలో ఇది ఆచరణకు నోచుకోలేదు. దీంతో కుక్కల సంతతి పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో కుక్కకాటు బాధితుల సంఖ్య కూడా భారీగానే నమోదవుతోంది. జిల్లా వ్యాప్తంగా రోజూ కుక్కల సమస్యలపై 150 నుంచి 200 ఫిర్యాదులు అందుతుండడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో గుర్తించిన 10,315 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం తాడిపత్రి, అనంతపురం, గుంతకల్లులో ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేసి, కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఆయా పరిధిలోని కుక్కల్ని మరో పది రోజుల్లోగా ఈ కేంద్రాలకు తరలించి ఆపరేషన్లు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



మహేష్ (ఫైల్)

బెళుగుప్ప: వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరుకు చెందిన మహేష్(21), తన మిత్రుడు కాలువపల్లి తండా గ్రామానికి చెందిన భానుప్రకాష్ నాయక్‌తో కలసి ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి కాలువపల్లికి బయలుదేరాడు. మానిరేవు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అటుగా వెళుతున్న వారు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహేష్ మృతిచెందినట్లుగా నిర్ధారించారు. భానుప్రకాష్ పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

బత్తలపల్లి: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆటో నడుపుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ముదిగుబ్బకు చెందిన మట్రా ఆంజనేయులు (59), అలివేలమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. దంపతులు ఆటోలో గ్రామాలు తిరుగుతూ తెల్లగడ్డలు విక్రయం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామునే ముదిగుబ్బ నుంచి ధర్మవరానికి ఆటోలో బయలుదేరారు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ దాటిన తర్వాత వెనుక నుంచి వేగంగా బండల లోడుతో దూసుకువచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన అలివేలమ్మను అటుగా వచ్చిన వారు గుర్తించి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిత

- వాల్మీకి విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవంలో వక్తలు



విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి చదువులపై దృష్టి సారించి ఉన్నత విద్యాభ్యాసంతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వాల్మీకి/బోయ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు సోమవారం స్థానిక రుద్రంపేట సమీపంలోని వాల్మీకి కల్యాణమంటపంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేరేలా పట్టుదల, ఏకాగ్రతతో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌సీ అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి ఎ. చైతన్య కుమార్, కోశాధికారి జి. పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, విశ్రాంత డీఎఫ్‌ఓ ఆదినారాయణ, ఏడీసీసీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు, తలారి ఆదినారాయణ, ఎంఈఓ వాణీదేవి, అంకె ముత్యాలు, మాజీ సీఈఓ ఈశ్వరయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

రామగిరి ఎంపీపీ ఎన్నిక మరోసారి వాయిదా



రామగిరి ఎంపీపీ ఎన్నిక జరిగే సమయంలో ఎన్నికల అధికారి ముందు వీడియో తీస్తున్న పోలీసులు



రామగిరి ఎంపీడీఓ కార్యాలయం ముందు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



రామగిరి ఎంపీపీ ఎన్నికలో పాల్గొన్న ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు

రామగిరి: రామగిరి ఎంపీపీ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. సభ్యులు రానందున వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. గత ఎన్నికల్లో మొత్తం 10మంది ఎంపీటీసీ సభ్యులుండగా ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తొమ్మిది మంది, ఒకరు టీడీపీ సభ్యుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ సభ్యులతో ఎంపీపీ స్థానాన్ని అప్పట్లో వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. మూడు నెలలక్రితం అప్పటి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. ఈ ఏడాది మార్చి 27న ఎన్నిక జరపాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంలో అధికారులు ఎన్నిక ప్రక్రియ మొదలు పెట్టారు. అనివార్య కారణాలతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో మరుసటి రోజు (మార్చి 28)కు ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సభ్యులు రామగిరిలో జరిగే ఎన్నిక ప్రక్రియకు హాజరవుతుండడంతో మార్గమధ్యంలోనే పెనుకొండలో పేరూరు2 ఎంపీటీసీ సభ్యురాలు భారతిని టీడీపీ మూకలు బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించుకుని ఎన్నిక వాయిదా పడ్డానికి కారణమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎంపీపీ ఎన్నికకు టీడీపీకి బలం లేకున్నా ఆ పార్టీ నాయకులు ఇద్దరు వైఎస్సార్‌సీపీ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి లోబర్చుకున్నారు. దీంతో ఆరుగురు సభ్యులున్న వైఎస్సార్‌సీపీకి ఎంపీపీ స్థానం లాంఛనమే అవుతుంది. ఇది జీర్ణించుకోలేని పరిటాల కుటుంబం రామగిరిలో తమ మాటే జరగాలంటూ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఎన్నిక వాయిదా పడ్డానికి కారణమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

రామగిరి వైస్ సర్పంచ్‌పై రౌడీషీటర్ దాడి..

రామగిరి ఎంపీపీ ఎన్నిక జరుగుతున్న సమయంలో రామగిరి గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ బోయ రామాంజినేయులపై రౌడీషీటర్ శివకుమార్ తన అనుచరులతో కలసి సోమవారం దాడి చేశాడు. టీ తాగేందుకని ఓ హోటల్‌కు వెళ్లగా సమీపంలో ఉన్న 20 నుంచి 30 మంది టీడీపీ శ్రేణులు ఒక్క సారిగా శివకుమార్ ఆధ్వర్యంలో రామంజినేయులను చుట్టుముట్టారు. ''ఇక్కడ నీకేం పని'' అని ప్రశ్నిస్తూ రామాంజినేయులపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. రామగిరి ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి రామగిరిలో టీడీపీ మూకలు హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయగా, పోలీసు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు.

పోలీసుల అత్యుత్సాహం

ఎంపీపీ ఎన్నిక జరిగే సమయంలో ఎంపీటీసీ సభ్యులతోపాటు ఎన్నికల అధికారులు, మీడియా సిబ్బంది మాత్రమే హాలులోకి అనుమతి ఉంది. పోలీసులు సైతం ఎన్నిక గది బయటే విధులు నిర్వర్తించాలి. అయితే ఎన్నికల నియమావళిని అధికారులు తుంగలోతొక్కి ఏకంగా ఎన్నిక జరిగే గదిలోకి ప్రవేశించి వీడియోలు తీయడం చర్చనీయాంశగా మారింది. అంతేకాక వివాదాస్పద రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ పదే పదే పోలీసులకు సలహాలు, సూచనలిస్తూ హడావుడి చేయడం గమనార్హం.

క్లుప్తంగా

నాణ్యతకు మారుపేరు 'భారతి సిమెంట్'



భవన నిర్మాణ కార్మికులకు బాండ్లు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్: నాణ్యతకు మారుపేరు 'భారతి సిమెంట్' అని కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ మోతిలాల్ నాయక్ తెలిపారు. సోమవారం నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో భవన నిర్మాణ కార్మికులకు బీమా బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. సిమెంట్ రంగంలోనే అత్యంత నాణ్యతతో కూడిందన్నారు. ప్యాకింగ్ మొత్తం టెంపర్ ప్రూఫ్‌తో తయారు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల వద్ద భవన నిర్మాణ కార్మికులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం వారికి సేఫ్టీ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా సంతోష్



అనంతపురం అర్బన్: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా జి.సంతోష కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈనెల 15వ తేదీ నుంచి సోమవారం వరకు తిరుపతిలో జరిగిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆరుగురికి జాతీయ కౌన్సిల్‌లో చోటు కల్పించారు. ఇందులో అనంతపురం జిల్లా నుంచి సంతోష్ కుమార్‌కు అవకాశం దక్కింది.

లేగదూడకు ఆపరేషన్



దూడ ముందరి కాళ్లకు ఆపరేషన్ చేసిన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ముందరి కాళ్లు ముడుచుకుపోయి పుట్టిన లేగదూడకు పశుశాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం బృందం ఆపరేషన్ చేసి బాగు చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రైతు చాకలి రామాంజనేయులుకు చెందిన పాడి ఆవుకు నాలుగు రోజుల కిందట దూడ పుట్టింది. పుట్టుకతోనే దూడ ముందరి కాళ్లు ముడుచుకుపోయి నడవడానికి ఇబ్బంది పడటంతో రైతు గార్లదిన్నె పశువైద్యులను సంప్రదించాడు. అక్కడి నుంచి శింగనమల పశువైద్యశాల ఏడీ డాక్టర్ పద్మనాభంకు రెఫర్ చేయడంతో.. దూడను అనంతపురం సాయినగర్‌లో ఉన్న పశువైద్యశాలకు తీసుకువచ్చారు. చిన్నపాటి ఆపరేషన్‌తో దూడ ముందరి కాళ్లను సరిచేశారు. దూడకు అవసరమైన ఫ్లూయిడ్స్, యాంటీబయాటిక్స్, అనాల్జిక్స్ అందజేశారు. పుట్టుకతోనే జన్యులోపాల కారణంగా కాలికి సంబంధించి ఫ్లెక్సర్ టెండన్స్ కనెక్ట్ కావడం వల్ల ఇలా జరుగుతుంటాయని వైద్యులు తెలిపారు.

'హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు'



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

అనంతపురం కార్పొరేషన్: హెచ్ఐవీ నియంత్రణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రజలను మేల్కొలిపేలా కళాకారులతో వీధి నాటకాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. సోమవారం నగరంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం సమీపంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకూడదని జంగం శ్రీనివాసులు కళా బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిడ్స్ పీయూ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్, ఏఎస్ఎం అలివేలు, ఓఆర్‌డబ్ల్యూలు షెక్షావలి, పీఈలు అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ కో–ఆర్డినేటర్ రాంబాబు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం నందమూరి నగర్ నగర్ వెనుక వైపు సీపీ రామన్ కళాశాల సమీపంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై రూరల్ పోలీసులు సోమవారం దాడి చేశారు. నిర్వాహకులు షహనాజ్, షేక్ హసీనా.. వివిధ ప్రాంతాల నుంచి మహిళలను పిలిపించి వ్యభిచారం నిర్వహించే వారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి, నిర్వాహకులతో పాటు ఒక విటుడు, ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. వీరికి సీఐ శేఖర్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

డ్రైనేజీనీ వదలరా తమ్ముళ్లూ!



డ్రైనేజీపై భవన నిర్మాణాన్ని ప్రారంభించిన టీడీపీ నాయకుడు

పంచాయతీ స్థలాలు కబ్జాలు చేసి అక్రమంగా భవనాలు నిర్మించుకోవడం చూశాం. అయితే ప్రస్తుతం డ్రైనేజీ కాలువలను సైతం అక్రమించుకుంటున్న సంఘటనలు వెలుగుచుస్తున్నాయి. అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని వెంగమనాయుడు కాలనీలో పంచాయతీ స్థలాన్ని ఇటీవలే అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. అందులో భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. మిగిలిన స్థలాన్ని ఖాళీగా వదిలేయడంతో దానిపై కన్నేసిన స్థానిక టీడీపీ నాయకుడు స్థలాన్ని అక్రమించుకున్నాడు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువను సైతం అక్రమించుకుని కాలువపైనే భవన నిర్మాణాన్ని సాగిస్తున్నాడు. అటువైపు వెళ్లిన స్థానికులు ఇదేక్కడి చోద్యం అంటూ అవాక్కు అవుతున్నారు. కొందరు స్థానికులు టీడీపీ నాయకుడిని ప్రశ్నించగా.. అధికారం మాదే మమల్ని ఏమి చేయలేరంటూ దౌర్జన్యాలకు దిగుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ స్థలాలు కళ్లెదుటే కబ్జాకు గురవుతున్నా.. పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ స్థలాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– అనంతపురం రూరల్:

రోడ్డు గుంతలమయం.. ప్రయాణం నరకం

ఈనెల 15వ తేదీన కురిసిన భారీ వర్షాలకు రాప్తాడు సమీపంలోని పండమేరు వంకపై ఉన్న రహదారి కొట్టుకుపోయింది. రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు మొత్తం బురదమయంగా ఉండటంతో ఈ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నాలుగు రోజుల్లో దాదాపు 10 మంది ద్విచక్ర వాహనాల్లో నుంచి కిందపడి గాయాలపాలైనట్లు సమాచారం. రాప్తాడు నుంచి అనంతపురానికి త్వరగా వెళ్లాలంటే చిన్మయ నగర్, జేఎన్‌టీయూ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ రోడ్డును బాగు చేయాలని సర్పంచ్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– రాప్తాడు:



పండమేరు వంకపై కొట్టుకుపోయిన జేఎన్‌టీయూ రహదారి

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

- చెత్త నిర్లక్ష్యంపై నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

అనంతపురం కార్పొరేషన్: చెత్త నిర్లక్ష్యంపై మంగళవారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు నగర పాలక సంస్థ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే మాత్రం జరిమానా తప్పదని హెచ్చరించారు. ఇటీవల కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించేది లేదన్నారు. స్పెషల్ డ్రైవ్ కోసం 74 సచివాలయాల పరిధిలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు పారిశుద్ధ్య కార్యదర్శులు డ్రైవ్‌లో పాల్గొంటారన్నారు. వ్యాపారులు ఇప్పటికైనా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకుని చెత్తను వాహనాలకు అందించాలన్నారు.

చలివేంద్రంలో కుండల ఏర్పాటు



ప్రజలకు తాగునీరు అందిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సచివాలయం వద్ద మొక్కుబడిగా చలివేంద్రం ఏర్పాటు చేయడంతో 'సాక్షి'లో 'కుండలు లేని చలివేంద్రం' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీఓ దివాకర్ ఆదేశాల మేరకు ఈఓఆర్డీ వెంకటనాయుడు సోమవారం ఉదయాన్నే అక్కడికి చేరుకుని చలివేంద్రాన్ని పరిశీలించారు. వెంటనే కుండలు ఏర్పాటు చేయించి అందులో తాగునీరు పోయించారు. రోజూ తప్పనిసరిగా నీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల అలసత్వం

- ఉదయం 10:30 గంటలైనా విధులకు హాజరుకాని వైనం
- అందరికీ మెమోలు జారీ చేసిన ఎంపీడీఓ

రాప్తాడురూరల్: కొందరు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగం అంటే భయం లేకుండా పోతోంది. పని వేళలు పాటించడం లేదు. జిల్లా, మండల స్థాయి అధికారులు వేళకు కార్యాలయాలకు వస్తున్నా.. వీరు మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. తాజాగా సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) రోజు అనంతపురం రూరల్ మండలం కురుగుంట సచివాలయ ఉద్యోగులు ఏ ఒక్కరూ 10:30 గంటలైనా కార్యాలయానికి రాలేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజు (సోమవారం) ఉదయం 9 గంటలకే విధుల్లో ఉండాలి. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు ఏర్పాటు చేసిన అలాంటి రోజే గంటలన్నర ఆలస్యంగా వచ్చారంటే తక్కిన రోజుల్లో ఎంతమాత్రం వస్తుంటారో అని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వీఆర్ఓ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ పని చేస్తున్నారు. వీరిలో ఎనర్జీ అసిస్టెంట్ ఫీల్డ్‌లో ఉంటారు.. తక్కిన ఏడుగురు ఉద్యోగులు కార్యాలయానికి రావాల్సి ఉంది. ఏ ఒక్కరూ కూడా అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఉదయం 10:15 గంటలకు ఈఓఆర్డీ వెంకటనాయుడు సచివాలయానికి వచ్చారు. ఆ సమయంలో ఏ ఒక్కరూ లేరు. అందరూ 10:30 గంటల తర్వాత కార్యాలయానికి రావడంతో ఈఓఆర్డీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు.

అందరికీ మెమోల జారీ

ఈఓఆర్డీ ఇచ్చిన నివేదిక మేరకు ఏడుగురు ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. సోమవారం కచ్చితంగా ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. కురుగుంట సచివాలయంలో అందరూ 10:30 గంటలు, ఆపైన వచ్చారని తెలిపారు. ఏ ఒక్కరూ ముందస్తు అనుమతి కూడా తీసుకోలేదన్నారు. సమయపాలన పాటించకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. వారిచ్చే వివరణను బట్టి చర్యలకు ఆయా శాఖ అధికారులకు నివేదిస్తామన్నారు.

జేమ్స్‌పై దాడి దారుణం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై పాశవికంగా దాడి చేయడం దారుణం. బాధ్యులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జేమ్స్ చదువుతున్న కళాశాలలోనే జూనియర్‌గా ఉన్న యశ్వంత్ నాయుడు జేమ్స్‌పై కక్ష పెంచుకుని రౌడీషీటర్లతో దాడి చేయించారన్నారు. కానీ తిరుచానూరు పోలీసులు నామమాత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్/అనంతపురం ఎడ్యుకేషన్: దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘాలు, రాయలసీమ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దళిత విద్యార్థిపై జరిగిన దాడికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల బీటెక్ విద్యార్థి జేమ్స్‌ను చిత్ర హింసలు పెట్టి నోట్లో మూత్రం పోసి దాడి చేయడం అత్యంత కిరాతకమన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయకపోతే కుల, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి చంద్రప్ప, ఐసా రాష్ట్ర అధ్యక్షుడు వేమన, రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, కేఎన్‌పీఎస్ నాయకులు ఓలయ్య, పీడీఎస్‌యూ బండారు శంకర్, కే.ఉదయ బాబు, తేజ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి



మాట్లాడుతున్న పి.రామకృష్ణ

రాప్తాడు: ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలనే డిమాండ్‌తో జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. హంద్రీ–నీవా కాలువకు సంబంధించి కాలువ వెడల్పు చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీ–నీవా ద్వారా ఆయకట్టుకు నీరు ఇచ్చేంత వరకూ సీపీఐ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర, సహాయ కార్యదర్శి చలపతి, శాఖ కార్యదర్శులు మహమ్మద్ రఫీ, సంజీవులు, పెద్ది రాజు, పెద్దన్న, ఆదినారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం



హోంగార్డు కృష్ణవేణిని సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. జిల్లా పోలీసుల శాఖలో సుదీర్ఘకాలంగా సేవలు అందించిన కూడేరు పోలీస్ స్టేషన్ మహిళా హోంగార్డు కృష్ణవేణి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం ఎస్పీ తన చాంబర్‌లో హోంగార్డు కృష్ణవేణిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్, ఏఆర్ ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కారం చూపాలి

అనంతపురం: పిటీషనర్లు అందించే ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం 72 పిటీషన్లు స్వీకరించారు. ప్రతి పిటీషనరుతో జిల్లా ఎస్పీ మాట్లాడారు. బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని కోరారు. మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సుందరయ్య



అనంతపురంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



రాప్తాడులో నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్/రాప్తాడు: పేదల పక్షాన పోరాటాలు సాగించిన పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీయుడని సీపీఎం నాయకులు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం, రాప్తాడులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్ర కుమార్, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకట నారాయణ, వలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అనంత రాముడికి పురస్కారం



అనంత రాముడికి పురస్కారం అందజేస్తున్న చిన్నజీయర్ స్వామి, తదితరులు

అనంతపురం: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడికి తెలుగు వన్ స్ఫూర్తి పురస్కారం దక్కింది. త్రిదండి చిన్నజియర్ స్వామి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అనంత రాముడిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నీటి తొట్టెల ఏర్పాటు

అనంతపురం కల్చరల్: మూగ జీవాలు ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఇబ్బంది పడకుండా సోమవారం నగరంలో పలు చోట్ల 10 నీటి తొట్టెలను ఏర్పాటు చేసినట్లు సామాజిక సేవా కార్యకర్త రుక్మిణి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పశు పక్ష్యాదుల గురించి ఆలోచించడం అందరి బాధ్యత అన్నారు. తలా ఒక చేయి వేస్తే నగరంలో మరిన్ని తొట్టెలు ఏర్పాటై వేసవి హాయిగా గడచిపోతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ధర్నా

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల మెస్ బిల్లులు పక్కదోవ పట్టాయంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. విద్యార్థుల మెస్ బిల్లులు అకౌంటెంట్ ఖాతాలోకి వేసుకున్నారని, సదరు అకౌంటెంట్, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు వినతి పత్రం అందజేశారు. మెస్ బిల్లులపై విచారణ కమిటీ ఏర్పాటు చేశామని.. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలుంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి, నాయకులు మంజునాథ్, నాని, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలి

అనంతపురం అర్బన్: అటెండర్‌ను చెప్పుతో కొట్టిన కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, నాయీబ్రాహ్మణ వృత్తిదారుల సమాఖ్య నగర అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడారు. అటెండర్ ఏదైనా తప్పు చేసి ఉంటే ఎక్సైజ్ సీఐగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలే తప్ప చెప్పుతో కొట్టడం సరికాదన్నారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగప్ప, రఘు, టీసీ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

అనంతపురం అర్బన్: రైతులను అన్ని విధాల ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఒకే దఫాలో ఇవ్వాలన్నారు. అదేవిధంగా 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఏడాది పంట నష్టపోవడంతో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులు పంట రుణం అసలు కట్టించుకుని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ వారంలో ప్రారంభమవుతున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తుగా విత్తనకాయలు సేకరించకపోవడం రైతులకు అన్యాయం చేయడమే అన్నారు. రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు మూడు దఫాల్లో కాకుండా ఒకే దఫాలు ఇవ్వడం ద్వారా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ప్రజాశక్తి కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కక్కలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షానికి కాలనీ నీట మునిగిన సందర్భంలో ప్రతి ఇంటికి విద్యుత్తు ప్రవహించి పిల్లలు, పెద్దలు విద్యుత్ షాక్‌కు గురయ్యారని తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి కాలనీవాసులు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. అర్థ్ సమస్యలు పరిష్కరించి, కొత్త లైన్లు వేయాలని డిమాండ్ చేశారు. ఏఈ సోమశేఖర్ మాట్లాడుతూ.. అర్థ్ వైర్లను బిగించి, ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు వెంకటనారాయణ, ఇర్ఫాన్, మసూద్, లతీఫ్, రాజు, గపూర్, రామాంజి, శ్రీనివాసులు, గోపాల్, అల్లా ప్రకాష్, వార్డ్ మెంబర్ ఆదెమ్మ, ప్రసాద్, ఖాదర్ పాల్గొన్నారు.

22న ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం: అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న 27 ద్విచక్ర వాహనాలను ఈనెల 22న వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఆసక్తి గలవారు రూ.2 వేలు డిపాజిట్ రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం ముగిసిన అనంతరం వేలం దక్కని వారికి రూ.2 వేలు డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

ట్రాఫిక్ జామ్..



శ్రీకంఠం సర్కిల్ ఇలా..



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ నుంచి శ్రీకంఠం సర్కిల్ వరకు సోమవారం ఒక్క ట్రాఫిక్ పోలీసు కూడా కనిపించలేదు. వాహనాలు ఇష్టానుసారంగా వెళ్లడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. చాలా సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఈఆర్ఓ రామ్మోహన్

రాప్తాడు: నియోజకవర్గంలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ) రామ్మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ.. ఓటర్ జాబితా కసరత్తుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనలు, చట్టాల్లో అవసరమైన మార్పు, చేర్పులకు రాజకీయ పార్టీ నుంచి సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. రెండు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నవారిని గుర్తించి, వెంటనే తొలగించాలని బీఎల్ఓలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. ఏమైనా సందేహాలుంటే వెంటనే ఎన్నికల డీటీని సంప్రదించాలన్నారు. తహసీల్దార్ విజయకుమారి, ఈడీటీ సువర్ణ, డీటీ చెన్నకేశవులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.